సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా

శుక్రవారం । 22 । డిసెంబర్ । 2023





జీటీడబ్ల్యూహెచ్ స్కూల్లో ట్యాబ్‌ల పంపిణీ కార్యక్రమానికి విచ్చేస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మెహన్‌రెడ్డి, అదే స్కూల్లో మొక్కను నాటుతున్న సీఎం

న్యూస్‌రీల్

నేటి 'జగనన్నకు చెబుదాం' రద్దు

• కలెక్టర్ సుమిత్‌కుమార్

పాడేరు : జిల్లాలో శుక్రవారం జరగనున్న జగనన్నకు చెబుదాం స్పందన ప్రత్యేక కార్యక్రమం అనివార్య కారణాల వల్ల రద్దు చేసినట్లు జిల్లా సుమిత్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి, ఎన్నికల రోల్ అబ్జర్వర్ జె. శ్యామలరావు జిల్లా పర్యటనలో భాగంగా శుక్రవారం ప్రత్యేక సమీక్ష నిర్వహిస్తున్నందున రద్దు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. ప్రజలంతా ఈ విషయాన్ని గమనించి ఐటీడీఏకు రావొద్దని ఆయన సూచించారు.

ఇన్‌చార్జ్ అటవీ క్షేత్రాధికారిగా సయ్యద్ సెహన్‌షా



రాజవొమ్మంగి : స్థానిక ఇన్‌చార్జి అటవీ క్షేత్రాధికారిగా సయ్యద్ సెహన్‌షా గురువారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం అడ్డతీగల రేంజ్ అధికారిగా కూడా పని చేస్తున్నారు. ఇప్పటి వరకు ఇక్కడ పనిచేసిన రేంజ్ అధికారి అబ్బాయిదొర రాజమహేంద్రవరంలోని అటవీశాఖ ప్రధాన కార్యాలయానికి బదిలీపై వెళ్లారు.

సింహాచలం దేవస్థానానికి హుకుంపేట కూరగాయలు

• అన్నదాన కార్యక్రమానికి సమకూర్చిన గిరిజన రైతులు



సింహాచలం దేవస్థానానికి కూరగాయలు పంపిస్తున్న భక్తులు

హుకుంపేట: ముక్కోటి ఏకాదశి పురస్కరించుకుని మండల కేంద్రం నుంచి సింహాచలంలో దేవస్థానానికి కూరగాయలు,గుమ్మడి కాయలను గురువారం స్థానిక భక్తులు పంపించారు. స్థానిక కోరిబిల్లి కనక మహాలక్ష్మి ఆధ్వర్యంలో స్థానికంగా పండించిన గిరిజనుల నుంచి సేకరించిన కూరగాయలు, చింతకాయలు, గుమ్మడికాయలను ప్రత్యేక వాహనంలో దేవస్థానానికి పంపించారు. అన్నదాన కార్యక్రమంలో వినియోగించేందుకు వీటిని సమకూర్చామని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో రాంబాబు, రామరాజు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణలో ఔషధ మొక్కలు కీలకం



గిరిజన రైతులకు ఔషధ మొక్కలను పంపిణీ చేస్తున్న డీఎఫ్‌వో వినోద్‌కుమార్

పాడేరు : పర్యావరణ పరిరక్షణలో ఔషధ మొక్కలు కీలకమని పాడేరు డీఎఫ్‌వో వినోద్‌కుమార్ తెలిపారు. నేషనల్ మెడిషనల్ ప్లాంటేషన్ బోర్డు సహకారంతో అమృత సంస్థ ఆధ్వర్యంలో గురువారం మండలంలోని డోకులూరు, తోటలగొంది, పరదేసిపుట్టు, మత్స్యపురం, ఎగు సోలములు గ్రామాలకు చెందిన 25 మంది రైతులకు మూడు వేల ఔషధ మొక్కలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డీఎఫ్‌వో మాట్లాడుతూ ఔషధ మొక్కలను రైతులు అంతర పంటగా సాగు చేసుకోవాలన్నారు. రేంజర్ పోలయ్య, అమృత సంస్థ ప్రోగ్రాం ఆఫీసర్ వింద్రా రామన్, సంస్థ ప్రతినిధులు మురళి, రవికుమార్, సునిల్‌కుమార్, బాలకృష్ణ, చిన్నమ్మి పాల్గొన్నారు.

ముమ్మరంగా కూంబింగ్



సీలేరులో వాహన తనిఖీలు చేస్తున్న పోలీసులు

సీలేరు: ఆంధ్రా–చత్తీస్‌గఢ్ సరిహద్దుల్లో మావోయిస్టులు బుధవారం రాత్రి విధ్వంసానికి పాల్పడిన నేపథ్యంలో స్థానిక పోలీసులు అప్రమత్తమయ్యారు. గురువారం ఎస్‌ఐ రామకృష్ణ ఆధ్వర్యంలో సీఆర్‌పీఎఫ్ బలగాలు ముమ్మరంగా తనిఖీలు నిర్వహించాయి. మావోయిస్టులు శుక్రవారం భారత్ బంద్‌కు పిలుపునివ్వడంతో సీలేరు మీదుగా విశాఖపట్నం, భద్రాచలం వెళ్లే నైట్ సర్వీసు, నైట్ హాల్ట్ బస్సు సర్వీసులను గురువారం రాత్రి నుంచి రద్దు చేసినట్టు ఆర్టీసీ అధికారులు తెలిపారు.

గిరిసీమల్లో విద్యా సుమాలు పూయించేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గిరిజన విద్యార్థులకు రెండో విడత ట్యాబులు అందించి దీవించారు. మీ భవితకు నాదీ పూచీ అంటూ భరోసానిచ్చారు. భావిపౌరుల బంగారు భవితవ్యాన్ని ఆకాంక్షించి తన పుట్టిన రోజున జన శ్రేయస్సు కోసమే తపించిన ఆయనకు గిరిజనం అడుగడుగునా నీరాజనం పట్టారు. మళ్లీ మీరే సీఎం కావాలంటూ నినదించారు.

చదువుల చందమామ



ట్యాబ్‌ల పంపిణీ సందర్భంగా విద్యార్థినులతో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి, చిత్రంలో విద్యాశాఖామంత్రి బొత్స సత్యనారాయణ

- విద్యా విప్లవాన్ని తీసుకొచ్చిన సీఎంకు నీరాజనం
- గిరిజన విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ
- వారి మధ్య జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలు
- మీ భవితకు నాదీ పూచీ అంటూ అక్కచెల్లెమ్మలకు భరోసా



ముఖ్యమంత్రితో కలెక్టర్ సుమిత్‌కుమార్



సీఎం జగన్‌కు కేక్ తినిపిస్తున్న విద్యార్థినులు

సాక్షి, విశాఖపట్నం : అల్లూరి సీతారామరాజు జిల్లా చింతపల్లి జీటీడబ్ల్యూహెచ్ స్కూల్లో విద్యార్థులకు సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ట్యాబ్‌ల పంపిణీ కార్యక్రమం గురువారం అట్టహాసంగా జరిగింది. రాష్ట్ర వ్యాప్తంగా రెండో విడత ట్యాబ్ పంపిణీ, 'నాడు – నేడు'లో భాగంగా రెండో విడత ఐఎఫ్ బీ ప్యానళ్లను విద్యార్థులకు ఆయన పంపిణీ చేశారు.

దిగ్విజయంగా పర్యటన

జిల్లాలో సీఎం వైఎస్ జగన్ పర్యటన దిగ్విజయంగా సాగింది. అల్లూరి సీతారామరాజు జిల్లా ఏర్పడిన తరువాత చింతపల్లి ప్రాంతానికి సీఎం తొలిసారిగా విచ్చేశారు. అదీ ఆయన పుట్టినరోజున ఇక్కడకు విచ్చేసి విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ చేయడంతో ఈ ప్రాంత ప్రజలు ఉప్పొంగిపోయారు.

అడుగడుగునా నీరాజనం

సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి అడుగడుగునా విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, అభిమానులు నీరాజనం పట్టారు. విద్యార్థులంతా పుట్టినరోజు సందర్భంగా కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల గ్రౌండ్లో ఏర్పాటుచేసిన కార్యక్రమాన్ని ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ముందుగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు, నాడు–నేడు పథకంలో జరిగిన అభివృద్ధి, విద్యార్థులకు అందించిన సంక్షేమ పథకాలను కలెక్టర్ సుమిత్‌కుమార్ వివరించారు.

పోటీ ప్రపంచంలో రాణించాలి: సీఎం జగన్

పోటీ ప్రపంచంలో ఏపీ విద్యార్థులు రాణించాలని, తమ ప్రభుత్వంలో 55 నెలల పాలనలో డిజిటల్ విప్లవాన్ని తీసుకువచ్చామని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. సభావేదికపై ఆయన మాట్లాడుతూ మారుతున్న కాలానికి అనుగుణంగా మనం వాటిని అందిపుచ్చుకుని రెట్టింపు అప్డేట్ అవుతూ..రాణించాలని సూచించారు. భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకొని అతి త్వరలో 'ఫ్యూచర్ స్కిల్స్' ఐబీ స్కిల్స్ తీసుకొస్తున్నామని తెలిపారు. మన ప్రభుత్వంలో విద్యారంగాన్ని పటిష్టం చేయడంతో ప్రభుత్వ పాఠశాలలతో ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలు సైతం పోటీ పడుతున్నాయన్నారు. ఆయన మాట్లాడినంత సేపు విద్యార్థులు కేరింతలతో.. జగన్ మామ అని..ప్రజలు జై జగనన్న అని నినాదాలు చేశారు.

పాడేరు నియోజకవర్గానికి వరాల జల్లు..

పాడేరు నియోజకవర్గంలో చింతపల్లి మండలం పరిధిలో రెండు బ్రిడ్జిలు, ఆరు బీటీ రోడ్ల నిర్మాణ చేపట్టాలని పాడేరు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి కోరారు. దీనిపై స్పందించిన ముఖ్యమంత్రి పాడేరు నియోజకవర్గంపై వరాల జల్లు కురిపించారు. యుద్ధ ప్రాతిపదికన వాటికి నిధులు మంజూరు చేసి నిర్మాణ పనులు పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు.

గిరిజన విద్యార్థుల మధ్య జన్మదిన వేడుకలు..

చింతపల్లి జీటీడబ్ల్యూహెచ్ స్కూల్ గిరిజన విద్యార్థుల మధ్య సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. సీఎం కేక్ కట్ చేసి విద్యార్థులకు తినిపించారు. విద్యార్థులు అందరూ 'హ్యాపీ బర్త్ డే జగన్ మామయ్య' అంటూ సీఎంకు కేక్ తినిపించారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు..

బహిరంగ సభ ప్రారంభానికి ముందు సాంస్కృతిక కార్యక్రమాలు, గిరి రైతుల సాగు విధానాలను నృత్య రూపకాలతో వివరిస్తూ విద్యార్థులు అలరించారు. ఈ కార్యక్రమంలో విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ఎమ్మెల్యేలు పుష్ప శ్రీవాణి, పెట్ల ఉమా శంకర్ గణేష్, పాడేరు నియోజకవర్గ పరిశీలకులు ఫరూఖీ, రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు గెడ్డం ఉమ, ముఖ్య నాయకులు శివ ప్రసాద్, శోభా హైమావతి పాల్గొన్నారు.

ప్రజాప్రతినిధులు, నేతలతో ముఖాముఖి

పాడేరు, అరకులోయ నియోజకవర్గాల పరిధిలోని స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలను కూడా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆత్మీయంగా పలకరించారు. వారందరితోను సీఎం మాట్లాడారు. వారి సమస్యలను కూడా తెలుసుకున్నారు.



ట్యాబ్‌ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

గిరిజనుల పక్షపాతి సీఎం జగన్

సాక్షి,పాడేరు: అల్లూరి సీతారామరాజు నడియాడిన గిరిజన ప్రాంతాన్ని ఆయన పేరుతో ప్రత్యేక జిల్లాగా ఏర్పాటు చేసి గిరిజన సంక్షేమానికి విశేష కృషిచేస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుకుంటున్నామని పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి పేర్కొన్నారు. చింతపల్లి సభలో ఆమె మాట్లాడుతూ చంద్రబాబు బాక్సైట్ తవ్వకాల జీవో 97ను తీసుకువస్తే జగనన్న ఆనాడు గిరిజనుల పక్షాన నిలిచి బాక్సైట్‌కు వ్యతిరేకంగా పోరాడారన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఆ జీవోలన్నింటిని రద్దు చేసి గిరిజనుల పక్షపాతిగా నిలిచారన్నారు. మహానేత డాక్టర్ వైఎస్సార్ అటవీ హక్కుల చట్టాన్ని తీసుకువస్తే, ఆయన తనయుడు జగన్‌మోహన్‌రెడ్డి పాడేరు ప్రాంతంలోనే లక్షా 13వేల మంది గిరిజనులకు 2లక్షల 27వేల ఎకరాల అటవీ భూములకు పట్టాలిచ్చారన్నారు. పాడేరులో రూ.500కోట్లతో వైద్య కళాశాల, చింతపల్లిలో వంద పడకలను మంజూరు చేశారు. వాటి నిర్మాణాలు చురుగ్గా జరుగుతున్నాయన్నారు. విద్య, వైద్యానికి అధిక ప్రాధాన్యమివ్వడంతో గిరిజన ప్రాంతానికి ఎంతో మేలు జరుగుతోందన్నారు. గిరిజన విద్యార్థులకు ఆంగ్లంతోపాటు డిజిటల్ విద్యను అందిస్తున్నారన్నారు. 8వతరగతి విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేసే రాష్ట్ర స్థాయి కార్యక్రమాన్ని చింతపల్లి ప్రాంతంలో ఏర్పాటుచేసి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి గిరిజనులపై ఉన్న అపారమైన ప్రేమ అభిమానాలను చాటుకున్నారన్నారు. గిరిజన ప్రాంత ప్రజల తరఫున సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు.

సీఎం పర్యటన సాగిందిలా..

అల్లూరి జిల్లా చింతపల్లిలో నిర్వహించే ట్యాబ్‌ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉదయం 10.18 గంటలకు విశాఖ ఎయిర్‌పోర్టుకు చేరుకున్నారు. అక్కడ మంత్రులు, ఎమ్మెల్యేలు స్వాగతం పలికి..జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం అక్కడ నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి అల్లూరి సీతారామరాజు జిల్లా చింతపల్లి మండలం చౌడపల్లి గ్రామంలో హెలిప్యాడ్ వద్దకు 11.20 గంటలకు చేరుకున్నారు. కలెక్టర్ సుమిత్‌కుమార్, స్థానిక ప్రజాప్రతినిధులు స్వాగతం పలికారు.

- అక్కడ నుంచి 11.40 గంటలకు జీటీడబ్ల్యూఎహెచ్ స్కూల్లో 15 నిమిషాల పాటు ట్యాబ్‌లు పంపిణీ చేశారు. అక్కడ నుంచి 12.03 గంటలకు ప్రభుత్వ డిగ్రీ కళాశాల క్రీడా మైదానంలో ఏర్పాటు చేసిన సభా వేదికకు చేరుకున్నారు. అక్కడ పది నిమిషాల పాటు ట్యాబ్ స్టాళ్లను పరిశీలించారు. అనంతరం జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు.
- సభావేదిక వద్ద ప్రసంగం అనంతరం 1.41కు అక్కడ నుంచి చౌడపల్లిలోని హెలిప్యాడ్ వద్దకు చేరుకున్నారు. అక్కడ ఐటీడీఏ పీవో పరిధిలో పలువురు నుంచి సీఎం గ్రీవెన్స్ తీసుకున్నారు. అనంతరం పార్టీ కార్యకర్తలను, నాయకులకు ఆత్మీయంగా పలకరించారు. సాయంత్రం 3.15 గంటలకు తిరిగి విశాఖ ఎయిర్‌పోర్టుకు బయలుదేరారు. విశాఖ ఎయిర్‌పోర్టులో సాయంత్రం 4.05 గంటలకు తిరిగి విమాన మార్గంలో విజయవాడ వెళ్లారు. ముఖ్యమంత్రి వెంట మంత్రులు బొత్స సత్యనారాయణ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ఎమ్మెల్సీ తలశిల రఘురాం ఉన్నారు.

గిరి విద్యార్థులతో మమేకమై..



తరగతి గదిలో డిజిటల్ బోధనను పరిశీలిస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి



డిజిటల్ బోధనపై విద్యార్థి నుంచి వివరాలు తెలుసుకుంటున్న ముఖ్యమంత్రి జగన్

- తరగతి గదిలో కూర్చొని డిజిటల్ పాఠం ఆలకించిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి
- సెల్ఫీలు దిగిన విద్యార్థులు

చింతపల్లి రూరల్: గిరిజన సంక్షేమశాఖ బాలుర ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులతో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మమేకమయ్యారు. హెలిప్యాడ్‌నుంచి ఆయన నేరుగా పాఠశాలకు చేరుకున్నారు. పాఠశాల ఆవరణలో మొక్కను నాటారు. అనంతరం 8వ తరగతి విద్యార్థులతో కలిసి డిజిటల్ పాఠం విన్నారు, విద్యార్థులు ఏ మేర అర్థం చేసుకుంటున్నారో పరిశీలించారు. పాఠశాలలో నాడు–నేడులో ఏర్పాటు చేసిన ఐఎఫ్‌బీ, గ్రీన్ బోర్డులను పరిశీలించారు. ఉపాధ్యాయులు బోధన విధానంపై సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థుల కోరిన మేరకు వారితో సెల్ఫీ దిగారు. అనంతరం 9వ తరగతి విద్యార్థులతో మాట్లాడారు. గత ఏడాది అందించిన ట్యాబ్‌లను ఎంతవరకు వినియోగిస్తున్నారో, ఏమేర వారికి ఉపయోగపడుతుందో తెలుసుకున్నారు. నాడు–నేడు పథకంలో ఏర్పాటుచేసిన ప్లాంట్‌ను పరిశీలించి, ఆ నీటిని తాగారు. ప్రభుత్వం అందిస్తున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవాలని విద్యార్థులకు ఆయన సూచించారు. పోటీ ప్రపంచంలో ఉన్నత శిఖరాలను చేరుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, ప్రధానోపాధ్యాయులు రామరాజుపడాల్, ఉపాధ్యాయులు ప్రసాదరావు, రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.



ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డితో సెల్ఫీ తీసుకుంటున్న, గిరిజన విద్యార్థి కె.శివశంకర్



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి



యాలకులతో తయారు చేసిన మాలతో సత్కారం



వైఎస్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి



సీఎంకు జ్ఞాపికను అందజేస్తున్న ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి, కలెక్టర్ సుమిత్‌కుమార్ తదితరులు

కాఫీ రైతులకు గిట్టుబాటు ధర లక్ష్యం

జీసీసీ ఎండీ సురేష్‌కుమార్

చింతపల్లి రూరల్: కాఫీ రైతులకు గిట్టుబాటు ధర కల్పించడమే జీసీసీ ముఖ్య ఉద్దేశమని ఆ సంస్థ ఎండీ వైస్ చైర్మన్ సురేష్‌కుమార్ అన్నారు. గురువారం స్థానిక జీసీసీ కార్యాలయంలో ఆయన గిరిజన రైతులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. గతంలో జీసీసీకి సహకరించిన రైతులతోపాటు రుణానలు పూర్తిస్థాయిలో చెల్లించిన 25 మంది రైతులకు టార్పాలిన్లను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాఫీ రైతులకు జీసీసీ అధిక ధరలు అందిస్తుందన్నారు. పార్చిమెంట్ కిలో రూ.280, చెర్రీ రూ.145 చొప్పున రైతులకు చెల్లిస్తున్నామన్నారు. ఇప్పటి వరకు 65 టన్నుల పార్చిమెంట్, మూడు టన్నుల చెర్రీని కొనుగోలు చేశామన్నారు. రైతులు దళారులకు అమ్మి మోసపోకుండా జీసీసీకి విక్రయించి లాభపడాలని సూచించారు. రైతుల వద్దకు తమ సిబ్బంది నేరుగా వెళ్లి కొనుగోలు చేస్తున్నారన్నారు. విక్రయించిన తరువాత ఒక్క రోజు వ్యవధిలోనే రైతుల ఖాతాల్లో నగదు జమ అవుతుందన్నారు. దళారులకు విక్రయించడం వల్ల నష్టం తప్ప ఏమాత్రం ప్రయోజనం ఉండదన్నారు. జీసీసీ డివిజనల్ మేనేజర్ పి. దేవరాజు, కాఫీ విభాగం సీనియర్ మేనేజర్ శ్రీనివాసరావు, అకౌంటెంట్ రాజు పాల్గొన్నారు.



పార్చిమెంట్ కాఫీని విక్రయించిన రైతుకు రశీదును అందజేస్తున్న జీసీసీ ఎండీ సురేష్‌కుమార్

కొండరెడ్ల జీవన ప్రమాణాల మెరుగుకు కృషి

- చింతూరు ఐటీడీఏ పీవో కావూరి చైతన్య
- కాలినడకన కొండలెక్కి చింతలపాడు గ్రామ సందర్శన

చింతూరు: కొండరెడ్ల జీవన ప్రమాణాలు మెరుగుపరిచేందుకు కృషి చేస్తున్నట్లు చింతూరు ఐటీడీఏ పీవో కావూరి చైతన్య అన్నారు. మండలంలోని ఎత్తయిన కొండ ప్రాంతంలో ఉన్న కొండరెడ్ల గ్రామమైన చింతలపాడును గురువారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామంలో ప్రధానమంత్రి జన జాతి ఆదివాసీ న్యాయ మహా అభియాన్ (పీఎం జన్‌మన్) పథకాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ పథకం ద్వారా కొండరెడ్లకు పక్కాగృహాలు, తాగునీరు, పారిశుద్ధ్యం, విద్య, ఆరోగ్యం, పోషకాహారం, రహదారులు, సమాచార వ్యవస్థ వంటి సౌకర్యాలు రాబోయే మూడేళ్లలో అందిస్తామన్నారు. కొండలపై నుంచి నివాసాలను మైదాన ప్రాంతాలకు మార్చుకుంటే అన్నిరకాల వసతులు కల్పిస్తామన్నారు. ఇందుకు వారు సమ్మతించారు. గ్రామంలోని ప్రాథమిక పాఠశాలను పరిశీలించిన ఆయన విద్యార్థులతో ముచ్చటించారు. కొండరెడ్లకు పైలెట్ ప్రాజెక్టు కింద కొత్త ఆధార్‌కార్డులు, మార్పులు, చేర్పులు, రైతుభరోసా, అమ్మఒడి, కిసాన్‌కార్డులు, ఉపాధిహామీ జాబ్‌కార్డులతో పాటు ప్రభుత్వ పథకాలు అందేలా చర్యలు చేపడతామని ఆయన హామీనిచ్చారు. కొండపోడు పట్టాల మంజూరుకు గ్రామసభ నిర్వహించి లబ్ధిదారులను ఎంపిక చేశారు. సమస్యలు తెలుసుకునేందుకు ఎంతో కష్టపడి కొండలు ఎక్కి వెళ్లిన పీవోకు వారు కృతజ్ఞతలు తెలిపారు. కూనవరం ఎంపీడీవో ప్రేమ్‌సాగర్, వీఆర్‌పురం ఎంపీడీవో ఫణీంద్ర, ఎఫ్‌ఆర్వో మోహినీ విజయలక్ష్మి పాల్గొన్నారు.



చింతలపాడు వెళ్లేందుకు ఎత్తయిన కొండ ఎక్కుతున్న పీవో చైతన్య



చింతలపాడు గ్రామస్తులతో మాట్లాడుతున్న పీవో చైతన్య



సభా వేదికపై సీఎం జగన్‌మోహన్‌రెడ్డి, మంత్రులు బొత్స సత్యనారాయణ, అమర్‌నాథ్, ఎంపీ మాధవి, ఎమ్మెల్యేలు కొట్టగుళ్ల భాగ్యలక్ష్మి, చెట్టి పాల్గుణ, నాగులపల్లి ధనలక్ష్మి, కలెక్టర్ సుమిత్‌కుమార్, విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్ తదితరులు


విద్యార్థులతో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి


ఆర్వో ప్లాంట్ నీటిని తాగుతున్న సీఎం జగన్


ముఖ్యమంత్రితో సెల్ఫీ తీసుకుంటున్న మహిళా ప్రజాప్రతినిధులు


సాంస్కృతిక ప్రదర్శనలో విద్యార్థులు


సభా వేదికపై మాట్లాడుతున్న విద్యార్థిని


ఆత్మీయ నేత కోసం తరలివచ్చిన గిరిజనం

క్లుప్తంగా

ప్రకృతి సాగుపై అవగాహన


చొప్పల్లిలో రైతులకు అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

వీఆర్ పురం: ప్రకృతి వ్యవసాయంతో నిరంతర ఆదాయం పొందవచ్చని రైతు సాధికార సంస్థ ప్రతినిధి శ్రీనివాస్ అన్నారు. ఏఎస్‌డీఎస్ స్వచ్ఛంద సంస్థ ,సెర్ప్ సంయుక్త ఆధ్వర్యంలో చొప్పల్లి గ్రామంలో గురువారం ప్రకృతి వ్యవసాయంపై నాలుగు మండలాలకు చెందిన మహిళా రైతులకు క్షేత్రస్థాయి శిక్షణ నిర్వహించారు. ప్రకృతి వ్యవసాయ సాగు పలు అంశాల్లో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ ఈ విధానంలో సాగుచేయడం ద్వారా సంవత్సరంలోని అన్ని కాలాల్లో కూడా రైతులు ఆదాయం పొందవచ్చన్నారు. ఎన్ఎఫ్ జ్యోతిర్మయి , పీఈ కొండా, భీష్మ , సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విశాఖలో ఇన్వెస్టర్స్ సర్వీస్ సెంటర్

సాక్షి, విశాఖపట్నం : రాష్ట్రంలోని సెక్యూరిటీస్ మార్కెట్ ఇన్వెస్టర్ల అవసరాలను తీర్చేందుకు సెబీతో పాటు ఎన్ఎస్ఈ, బీఎస్ఈ స్టాక్ ఎక్స్చేంజీలు కలిసి నగరంలో 'ఇన్వెస్టర్ సర్వీస్ సెంటర్'ని గురువారం ప్రారంభించాయి. నేషనల్ స్టాక్ ఎక్స్చేంజీ నిర్వహించే ఈ సెంటర్ కార్యకలాపాల ను సెబీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎస్వీ మురళీధర్‌రావు, ఎన్ఎస్ఈ లిస్టింగ్ ఇన్వెస్టర్స్ కంప్లయిన్స్ చీఫ్ రెగ్యులేటరీ అధికారి అంకిత్ శర్మ, రీజనల్ రెగ్యులేటరీ సంతోష్ మోహన్‌దాస్ ప్రారంభించారు. సెక్యూరిటీల మార్కెట్‌లో లిస్టెడ్ కార్పొరేట్ సంస్థలు, ఇతర నమోదిత మధ్యవర్తులకు సంబంధించిన పెట్టుబడిదారుల ఫిర్యాదుల పరిష్కారాన్ని ఈ సెంటర్ సులభతరం చేస్తుందని మురళీధర్‌రావు తెలిపారు. రాష్ట్రంలో పెట్టుబడిదారుల అవగాహన కార్యక్రమాల నిర్వహణకు కూడా కేంద్రం దోహదపడుతుందని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సెబీ, బీఎస్ఈ ప్రతినిధులు పాల్గొన్నారు.

విశాఖ చేరుకున్న మాదక ద్రవ్యాల నిరోధక బృందం

దాబాగార్డెన్స్: సింహాద్రి టీఎంటీ, హిమా హ్యూమానిటేరిన్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో గత నెల 29న చేపట్టిన మాదకద్రవ్యాల నిరోధక కార్ ర్యాలీ తమిళనాడు, కేరళ, కర్ణాటక, తెలంగాణ మీదుగా గురువారం విశాఖ చేరుకుంది. ఈ సందర్భంగా ర్యాలీ బృందం మేయర్ గొలగాని హరి వెంకటకుమారిని మర్యాద పూర్వకంగా కలిసింది. దారిపాడవునా కళాశాల విద్యార్థులకు చేపట్టిన అవగాహన కార్యక్రమాలను వివరించారు. ఈ సందర్భంగా బృందానికి మేయర్ జ్ఞాపిక బహూకరించారు. హిమా హ్యూమానిటేరియన్ వ్యవస్థాపకుడు టీవీడీ దాస్ మాట్లాడుతూ దక్షిణ భారతదేశంలో ఆయా భాషాల్లో ముద్రించిన కరపత్రాలు విద్యార్థులకు అందజేసి మాదక ద్రవ్యాలకు దూరంగా ఉంటామని ప్రతిజ్ఞ చేయించినట్టు తెలిపారు.

నడి సంద్రంలో తప్పిన పెను ప్రమాదం


రుషికొండ బీచ్‌లో ఢీకొట్టిన రెండు స్పీడ్ బోట్లు

కొమ్మాది: ప్రముఖ పర్యాటక ప్రాంతం రుషికొండ బీచ్‌లో నడి సంద్రంలో పెనుప్రమాదం తప్పింది. పర్యాటకులు తెలిపిన వివరాల ప్రకారం... ఏపీ టూరిజం నిర్వహిస్తున్న స్పీడ్ బోటులో 8 మంది పర్యాటకులు గురువారం సాయంత్రం బోటు షికారుకు వెళ్లారు. అదే సమయంలో ఓ ప్రైవేటు బోటులో ఐదుగురు షికారుకు వెళ్లారు. ఈ క్రమంలో అతి వేగంగా వస్తున్న ప్రైవేటు స్పీడ్ బోటు ఏపీ టీడీసీ స్పీడ్ బోటును బలంగా ఢీకొట్టింది. ఈ క్రమంలో ప్రైవేటు బోటు పూర్తిగా టూరిజం బోటు క్రిందకు చొచ్చుకుని పోవడంతో అందులో ప్రయాణిస్తున్న నలుగురు పర్యాటకులు ఒక్కసారిగా సముద్రంలో పడిపోయారు. అయితే వీరు లైఫ్ జాకెట్ల సహాయంతో ప్రాణాలతో బయటపడ్డారు. ఈ ప్రమాదంలో ఎవరికీ ప్రాణాపాయం లేకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

ఓవరాల్ చాంపియన్స్ వీరే

మురళీనగర్: ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీ, కెమికల్ ఇంజినీరింగ్ కాలేజీల్లో మూడు రోజులుగా నిర్వహిస్తున్న ప్రాంతీయ అంతర పాలిటెక్నిక్ క్రీడా పోటీల్లో బాలికల విభాగంలో భీమిలి బాలికల ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీ, బాలుర విభాగంలో గిడిజాల సాయిగణపతి పాలిటెక్నిక్ విద్యార్థులు ఓవరాల్ చాంపియన్లుగా నిలిచారు. పోటా పోటీగా సాగిన ఈ పోటీలు గురువారం ముగిశాయి. బాలికల విభాగంలో వ్యక్తిగత చాంపియన్‌షిప్ ట్రోఫీని కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీ నుంచి ఆర్.షమిత, సాయిగణపతి కాలేజీ నుంచి ఎస్.మల్లేశ్వరి కైవసం చేసుకున్నారు. బాలుర విభాగంలో వ్యక్తిగత చాంపియన్‌షిప్‌ను ఎం.ధర్మేశ్వర్ సాధించారు. బాలుర గేమ్స్ చాంపియన్‌షిప్‌ను కశింకోటలోని ది రాజీవ్‌గాంధీ ఆర్ఈసీఎస్ పాలిటెక్నిక్ కాలేజీ, విశాఖలోని ఏపీఎన్ పాలిటెక్నిక్ కాలేజీలు సంయుక్తంగా గెలుచుకున్నాయి. గేమ్స్ అండ్ స్పోర్ట్స్ మీట్‌ను గైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణ అధ్యక్షతన గురువారం సాయంత్రం నిర్వహించారు. ముగింపు సమావేశంలో రాష్ట్ర టెక్నికల్ ఎడ్యుకేషన్ విశ్రాంత జాయింట్ డైరెక్టర్ ఎస్పీయూఎం ప్రసాద్, ఐఐపీఈ మాజీ డైరెక్టర్ ఆచార్య వీఎస్‌కే ప్రసాద్, ప్రముఖ క్రీడాకారుడు, వెటరన్ ఒలింపియన్ ఎంపీ మాణిక్యాలు విజేతలకు ట్రోఫీలు అందించారు. సమావేశంలో పాలిటెక్నిక్ కాలేజీ ప్రిన్సిపాల్ జీఎస్ఎన్ మూర్తి, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ కేడీవీ నరసింహారావు పాల్గొన్నారు.

7న ఏపీఎంఈఎస్ఏ తొలి మహాసభ


పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఏపీ జేఏసీ అమరావతి చైర్మన్ బొప్పరాజు వేంకటేశ్వర్లు, నాయకులు

దాబాగార్డెన్స్: ఏపీ మున్సిపల్ ఎంప్లాయిస్ సర్వీసెస్ అసోసియేషన్(ఏపీఎంఈఎస్ఏ) తొలి మహాసభ జనవరి 7న గురజాడ కళాక్షేత్రంలో నిర్వహించనున్నట్టు ఏపీ జేఏసీ అమరావతి చైర్మన్ బొప్పరాజు వేంకటేశ్వర్లు తెలిపారు. జీవీఎంసీలో గల అసోసియేషన్ కార్యాలయంలో గురువారం మహాసభ పోస్టర్‌ను వీఎంసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు వీవీ వామన రావు, ఏపీఎంఈఎస్ఏ అధ్యక్షుడు దొప్పలపూడి ఈశ్వరరావుతో కలిసి ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర విభజన జరిగి పదేళ్లయినా ఇప్పటికీ సర్వీస్ రూల్స్ విషయంలో ప్రభుత్వాలు మాట్లాడకపోవడం శోచనీయమన్నారు. పదోన్నతుల విషయంలో ఇక్కట్లు తప్పడం లేదన్నారు. జనవరి 7న విశాఖలో నిర్వహించనున్న అసోసియేషన్ తొలి మహాసభకు ఏపీ విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, మున్సిపల్ శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ పాల్గొంటున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో గుమ్మడి నర్సింగరావు, నాగేశ్వరరావు, గొండు సీతారామ్, అప్పలరాజు, పీతల వేంకటేశ్వరరావు, బిర్లంగి శంకర్రావు, అడపా అప్పలనాయుడు, సన్నీ, పి.పద్మజ, శ్రీనుబాబు, మంగరాజు, శివ, గణపతి, రాజేష్, శ్రీనివాసరావు, వీరబాబు, అప్పలరాజు, పోలారావు పాల్గొన్నారు.

కిరణ్ కృష్ణ ఎండీపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు

విశాఖ సిటీ: కిరణ్ కృష్ణ రియల్ ఎస్టేట్ మేనేజింగ్ డైరెక్టర్ వల్లభనేని కృష్ణ ప్రసాద్‌పై ఆనందపురం పోలీసులు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు. రిటైర్డ్ ప్రొఫెసర్ రఘు 30 క్రితం కిరణ్ కృష్ణ రియల్ ఎస్టేట్ సంస్థ నుంచి ఆనందపురం మండలంలో స్థలాన్ని కొనుగోలు చేశారు. ఇప్పటివరకు ఆ స్థలాన్ని చూపించకుండా సంస్థ ప్రతినిధులు తప్పించుకొని తిరుగుతున్నారు. దీనిపై 2008లో రఘు నాలుగో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో డాక్యుమెంట్‌లో తప్పులు ఉన్నాయని వాటిని సరిచేయాలని చెప్పి సవరణ రిజిస్ట్రేషన్ చేశారు. అయినా స్థలాన్ని చూపించకపోవడంతో రఘు ఆనందపురం పోలీసులతో పాటు సబ్ రిజిస్ట్రార్‌కి ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో రఘు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం నుంచి సంస్థ ఎండీ వల్లభనేని కృష్ణప్రసాద్‌కు ఫోన్ చేశారు. స్థలం విషయం అడగ్గా కృష్ణప్రసాద్ కులం పేరుతో రఘుని దూషించారు. దీంతో ఆయన ఆనందపురం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కృష్ణ ప్రసాద్‌పై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు.

గ్రూప్-2 ఉచిత శిక్షణ దరఖాస్తుకు నేడు గడువు

ఎంవీపీ కాలనీ: స్థానిక సర్దార్ గౌతు లచ్చన్న ఏపీ బీసీ స్టడీ సర్కిల్‌లో గ్రూప్–1, గ్రూప్–2 అభ్యర్థులకు ప్రిలిమినరీ పరీక్షలపై శిక్షణ ఇవ్వనున్నారు. గ్రూప్–2 శిక్షణ దరఖాస్తులకు శుక్రవారం సాయంత్రంతో గడువు ముగియనుంది. డిగ్రీలో మార్కులు ఆధారంగా మెరిట్ నిర్ణయించి 40 మందిని ఎంపిక చేయనున్నారు. ఈ నెల 27వ తేదీ నుంచి శిక్షణ తరగతులు ప్రారంభం కానున్నాయి. గ్రూప్–1 అభ్యర్థులు ఉచిత శిక్షణకు దరఖాస్తు చేసుకునేందుకు ఈ నెల 31వ వరకు గడువు ఉంది. శిక్షణకు 60 మందిని ఎంపిక చేయనున్నారు. అభ్యర్థులు తమ దరఖాస్తులను ఎంవీపీ కాలనీలోని స్టడీ సర్కిల్‌లో అందజేయనున్నారు. వివరాలకు 0891–2564346, 9492569177 నంబర్లలో సంప్రదించవచ్చు.

ఏసీబీకి చిక్కిన హెడ్ కానిస్టేబుల్

- ఓ కేసు సెటిల్‌మెంట్‌లో రూ.5వేలకు ఒప్పందం
- డబ్బులు తీసుకుంటుండగా పట్టుకున్న అధికారులు


గాజువాక పోలీస్ స్టేషన్‌లో ఏసీపీతో మాట్లాడుతున్న అడిషనల్ ఎస్పీ శ్రావణి


హెడ్ కానిస్టేబుల్ రాజశేఖర్

అక్కిరెడ్డిపాలెం: గాజువాక పోలీస్ స్టేషన్‌లో ఓ హెడ్ కానిస్టేబుల్ లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు గురువారం చిక్కాడు. ఏసీబీ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం... అజీమాబాద్‌కు చెందిన భాషాకు హుస్సేన్, రసూల్ ఇద్దరు కుమారులు. పెద్దకుమారుడు హుస్సేన్ అనకాపల్లిలో ఉంటున్నాడు. ఒక విషయంలో వివాదం చెలరేగడంతో తండ్రి, పెద్ద కొడుకు హుస్సేన్ ఈ నెల 5న ఘర్షణ పడ్డారు. దీంతో వీరిద్దరూ గాజువాక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసుకున్నారు. ఈ కేసును హెడ్ కానిస్టేబుల్ రాజశేఖర్‌కు ఉన్నతాధికారులు అప్పగించారు. ఈ కేసు విషయమై భాషా చిన్న కుమారుడు రసూల్ హెడ్ కానిస్టేబుల్ వద్దకు ఇటీవల వచ్చి గొడవను పెద్దది చేయకుండా సెటిల్ చేయాలని కోరగా... అందుకు రూ.10 వేలు ఇవ్వాలని రాజశేఖర్ డిమాండ్ చేశాడు. చివరకు రూ.5 వేలు ఇచ్చేందుకు రసూల్ అంగీకరించాడు. అనంతరం రసూల్ ఏసీబీ అధికారులను ఆశ్రయించడంతో వారు పక్కాగా వ్యూహరచన చేశారు. రసూల్ గాజువాక పోలీస్ స్టేషన్ ఆవరణలోని ఒక ఆటోలో రూ.5 వేలు పెట్టడంతో... ఆ డబ్బులు హెడ్‌కానిస్టేబుల్ రాజశేఖర్ తీస్తుండగా ఏసీబీ అడిషనల్ ఎస్పీ శ్రావణి ఆధ్వర్యంలో రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అనంతరం గాజువాక పోలీస్ స్టేషన్‌లో పలు ఫైళ్లను ఏసీబీ అధికారులు క్షుణ్ణంగా తనిఖీ చేశారు. గాజువాక ఎస్ఐ ఎల్.భాస్కరరావు, సౌత్ ఏసీపీ టి.త్రినాథ్ నుంచి వివరాలు సేకరించారు. గతంలో రాజశేఖర్ రైటర్‌గా పనిచేశారు. గురువారం సాయంత్రం రిమాండ్‌కు తరలించారు.

ఇండస్ ఆస్పత్రికి షోకాజ్ నోటీసు

జారీ చేసిన డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు

మహారాణిపేట: ఇండస్ ఆస్పత్రికి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ షోకాజ్ నోటీసు జారీ చేసింది. ఆస్పత్రి నిర్వాహకుల నిర్లక్ష్యం కారణంగానే అగ్ని ప్రమాదం జరిగినట్లు విచారణ కమిటీ నిర్ధారణకు వచ్చింది. దీంతో ఆస్పత్రి లైసెన్స్ ఎందుకు రద్దు చేయకూడదో వివరణ ఇవ్వాలంటూ డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు గురువారం షోకాజ్ నోటీసు జారీ చేశారు. ఈ నెల 14వ తేదీన జగదాంబ జంక్షన్ ప్రాంతంలో ఉన్న ఇండస్ ఆస్పత్రిలో అగ్ని ప్రమాదం జరిగిన విషయం తెలిసిందే. ఈ ఘనటపై అధికార యంత్రాంగం హుటాహుటిన స్పందించి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న 47 మంది రోగులను వేరే ఆస్పత్రులకు తరలించడంతో పెద్ద ప్రమాదం తప్పింది. ఈ ఘటనలో ఎవరికి ఎటువంటి ప్రాణనష్టం జరగలేదు. అయితే ప్రమాదానికి గల కారణాలపై విచారణ చేపట్టాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున సంబంధిత శాఖలకు చెందిన అయిదుగురు అధికారులతో కమిటీ ఏర్పాటు చేశారు. విశాఖ రెవెన్యూ డివిజనల్ అధికారి డి.హుస్సేన్ సాహెబ్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు, జిల్లా ఆస్పత్రుల సమన్వయ అధికారి డాక్టర్ రమేష్ కిషోర్, జిల్లా అగ్ని మాపక శాఖాధికారి రేణుకయ్య, ఈస్ట్ ఏసీపీ మూర్తిలతో కూడిన కమిటీ ప్రమాదానికి గల కారణాలపై విచారణ చేపట్టింది. ఇందులో షార్ట్ సర్క్యూట్ కారణంగానే ప్రమాదానికి జరిగినట్లు నిర్ధారణకు వచ్చారు. ఆస్పత్రిలో పాత ఎలక్ట్రికల్ వైరింగ్ కారణంగానే షార్ట్ సర్క్యూట్ అయి మంటలు చెలరేగడం, అలాగే ఆస్పత్రి రెండో అంతస్తులో ఉన్న ఆపరేషన్ థియేటర్‌లో మండే స్వభావం గల నైట్రస్ ఆక్సైడ్ లీక్ అవడంతో మంటలు, దట్టమైన పొగ సంభవించినట్టు తేలింది. దీనిపై కమిటీ నివేదిక తయారు చేసి కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జునకు సమర్పించారు. దీనిపై డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు గురువారం ఇండస్ ఆస్పత్రికి షోకాజ్ నోటీస్ జారీ చేశారు. ఆస్పత్రిని ఎందుకు సీజ్ చేయకూడదో వివరణ ఇవ్వాలని ఆ నోటీసులో పేర్కొన్నారు.

85 కిలోల గంజాయి పట్టివేత

- కారు, ద్విచక్ర వాహనం సీజ్
- నలుగురు అరెస్ట్, ఒకరు పరారీ


పట్టుబడిన గంజాయి, కారు, ద్విచక్ర వాహనంతో జిల్లా టాస్క్‌ఫోర్ అధికారులు, సిబ్బంది

పాడేరు: పెదబయలు ప్రాంతం నుంచి మైదాన ప్రాంతానికి గంజాయి తరలిస్తున్న ఒక ముఠాను జిల్లా స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారులు, జిల్లా టాస్క్‌ఫోర్స్ అధికారులు సంయుక్తంగా పట్టుకున్నారు. ఏఈఎస్ డి.వి.జి.రాజు గురువారం పాడేరులో వివరాలు వెల్లడించారు. జిల్లా టాస్క్‌ఫోర్స్, ఎస్ఈబీ అధికారులు ముందస్తు సమాచారం మేరకు గురువారం పాడేరు మండలం గుత్తులపుట్టు సంతబయలు వద్ద కాపు కాశారు. ముందు అటువైపుగా పైలెట్‌గా వస్తున్న ద్విచక్ర వాహనాన్ని, వెనుక వచ్చిన కారును ఆపి తనిఖీ చేశారు. కారు సిగ్నల్స్ ఏరియాలో ప్రత్యేకంగా అరలుగా తయారు చేసిన ప్రాంతంలో గంజాయిని గుర్తించారు. దీంతో 85 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని రవాణాకు ఉపయోగించిన కారు, ద్విచక్ర వాహనాన్ని సీజ్ చేశారు. గంజాయి తరలిస్తున్న ఉత్తరప్రదేశ్ రాష్ట్రం ఉగ్రేసిన్ గ్రామానికి చెందిన రింకు కుమార్, లూధాపుర్ గ్రామానికి చెందిన అమిత్‌కుమార్‌లతోపాటు పెదబయలు మండలం కిముడుపల్లి పంచాయతీ అరడగూడెం గ్రామానికి చెందిన గెమ్మెలి బుల్లిబాబు, ముంచంగిపుట్టు మండలం సువ్వపుకోట గ్రామానికి చెందిన లకే జగన్నాథంలను అరెస్ట్ చేశారు. పెదబయలు మండలం చిట్టిగరువు గ్రామానికి చెందిన వనుగు నరసింమూర్తి పరారయ్యాడు. ఈ దాడిలో టాస్క్‌ఫోర్స్ సీఐ కూర్మారావు, సిబ్బంది పాల్గొన్నారు.

నువ్వు విత్తనాల పంపిణీ


కిమ్మూరులో రైతులకు నువ్వుల విత్తనాలు అందిస్తున్న శాస్త్రవేత్త చిరంజీవి, ఏవో సువర్ణకుమారి

అడ్డతీగల: చీడపీడలను తట్టుకుని అధిక ఆదాయాన్నిచ్చే శారదా(వైఎల్ఎం-66) రకం నువ్వుల విత్తనాలను రైతులకు ఉచితంగా అందిస్తున్నట్టు పందిరిమామిడి కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త ఎన్.చిరంజీవి అన్నారు. జాతీయ ఆహార భద్రత మిషన్–నూనెగింజలపై సామూహిక ప్రథమశ్రేణి ప్రదర్శనలో భాగంగా అడ్డతీగల మండలం కిమ్మూరులో 75 మంది రైతులకు నువ్వుల విత్తనాలను గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. అధిక దిగుబడితో పాటు తెగుళ్లను తట్టుకునే శారదా నువ్వుల రకం విత్తనాలను ఒక్కో రైతుకి 2 కిలోల చొప్పున అందిస్తున్నామని శాస్త్రవేత్త చిరంజీవి అన్నారు.భూమి ఎక్కువగా ఉన్న రైతులకు 3-4 కిలోలు కూడా ఇస్తున్నామన్నారు. 225 కిలోల విత్తనాలు రూపేణా పంపిణీ చేశామన్నారు. బూడిద, ఆకుమచ్చ తెగుళ్లను సైతం తట్టుకుంటుందన్నారు. సీటి, కలుపు యాజమాన్యం, పురుగుల, తెగుళ్ల యాజమాన్యం వంటి అంశాలపై రైతులకు శాస్త్రవేత్త చిరంజీవి అవగాహన కల్పించారు. రైతులు ఆహార భద్రత మిషన్ కింద ఆధాయన్నిచ్చే మేలు రకం నువ్వుల విత్తనాలు ఇస్తూ ప్రభుత్వం ప్రోత్సహిస్తుందన్నారు. వీఏఎలు అనిల్, ప్రదీప్, రైతులు పాల్గొన్నారు.